175 చోట్ల విషతుల్యం..

తూర్పు,మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్లు విషతుల్యంగా మారిన ట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందటే గుర్తించింది.కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు,మునిసిపాల్టీలు సర్వే చేశాయి. అత్యధికంగా కోనసీమలో కోళ్ల,రొయ్యల వ్యర్థాలు, కడి యం,ద్వారపూడి,అనపర్తి,బిక్కవోలు,సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్లు వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు.ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం,భూగర్భ జలాలు సైతం కలుషితమైనట్టు ఆయాశాఖలు తేల్చాయి. కాలువలు కాలుష్యంగా మారినచోట వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అప్పట్లో ప్రయత్నించారు.కానీ అప్పటి ప్రభుత్వం ప్రచారం కోసం మినహా పైసా కూడా ఇవ్వకపోవడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడ్డాయి.







విద్యుత్ వెలుగుల్లో సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం.. ఆలయ కోనేరు పుష్కరిణిలో హంసవాహనంపై తెప్పోత్సవం.. పక్కన స్వామి అమ్మవార్లు

వైభవంగా భీమేశ్వరస్వామి తెప్పోత్సవం

- 7లో

మాజీ ఎంపీ కేఎస్సార్ తనయుడే కాగ్ చీఫ్

- 6లో



కాగ్ చీఫ్‌గా కె.సంజయ్‌మూర్తి నియామకం

1996లో ఎంపీగా పనిచేసిన కేఎస్సార్ మూర్తి

ఈ ప్రాంత ప్రజలతో సంజయ్‌మూర్తికి సత్సంబంధాలు



సోషల్ మీడియాలో వికృత క్రీడ

6లో

గీత దాటితే తప్పవు కేసులు, జైలు

తునిలో 17 మంది అరెస్టు.. రిమాండ్

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ 1.73 కోట్లు

- 7లో

గోదారంతా.. గరళమే!





ఈ వ్యర్థం.. అనర్థమే : కాలువలను కలుషితం చేస్తున్న వ్యర్థాలు

ఒకనాడు గోదావరి కాలువల్లో నీటిని చేతితో ఒడిసిపట్టి తాగేవాళ్లం.. ఇప్పుడు ఆ నీరు తాగాలంటేనే భయమేస్తోంది.. ఇదీ ఒక 70 ఏళ్ల పెద్దాయన మాట.. మేం గతంలో గోదావరి కాలువల నీటినే బిందెలతో తెచ్చుకుని తాగేవాళ్లం.. ఇప్పుడు నీటిని కొనుక్కుని తాగుతున్నాం.. ఇదీ 60 ఏళ్ల బామ్మ మాట.. ఎందుకంటే నాటికి నేటికి గోదావరి కాలువల నిర్వహణలో ఎంతో తేడా ఉంది.. ప్రస్తుతం కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి.. నీళ్లు తాగడం కాదు.. స్నానం చేయడానికే భయపడేంతగా నీళ్లు కలుషితమయ్యాయి.. రెండేళ్ల కిందట ఈ విషయం గుర్తించినా గత వైసీపీ ప్రభుత్వం మాటలు తప్ప.. అలాగే వదిలేసింది.. ఈ విషయం తెలియని ప్రజలు ఆ నీటినే తాగి రోగాల బారినపడ్డారు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్లీన్ గోదావరిపై దృష్టి సారించాల్సి ఉంది.. లేదంటే మరింత ప్రమాదం ముంచుకొస్తుంది..!

- రెండేళ్ల కిందటే అధికారుల నివేదిక
- నాటి సీఎం రూ.100 కోట్ల హామీ
- రూపాయి కూడా విదల్చని వైనం
- కాలుష్య రహితం చేస్తామని గొప్పలు
- అటకెక్కిన 'మిషన్ క్లీన్ గోదావరి'
- ఉమ్మడి జిల్లాలకు కలుషిత నీళ్లు
- వేలాది మందికి ఈ నీళ్లే దిక్కు
- నేటికీ మారని తీరు
- ఎక్కడికక్కడ యథేచ్ఛగా వ్యర్థాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

175 ప్రాంతాల్లో కాలువలు కలుషితం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు అటకెక్కిపోయింది. నాలుగేళ్ల నుంచీ పనుల్లో అతీగతీలేక ఎక్కడిదక్కడే అన్నట్లు ఆగిపోయింది.ఉమ్మడి జిల్లాలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయిన నేపథ్యంలో వాటిని శుద్ధి చేస్తామని ప్రకటించి గత వైసీపీ సర్కారు గాలికొదిలేసింది.ఈ నీటిని శుద్ధి చేశాకే పంట కాలువల్లోకి నీరు వదులుతామని ప్రగల్భాలు పలికింది. ఈ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పలు చెప్పిన అప్పటి సీఎం జగన్ తీరా నిధుల మంజూరును కాగితాలకే పరిమితం చేశారు.కానీ క్షేత్రస్థాయిలో గత నాలుగేళ్లుగా కనీసం పట్టించుకోకపోవడంతో కాలువలు దయనీయంగా మారాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 175 చోట్ల గోదావరి కాలువల వద్ద కాలుష్యం తీవ్రంగా ఉందని గుర్తించారు. కూటమి ప్రభుత్వం కాలువల బాగుపై దృష్టిసారించాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన మిషన్ క్లీన్ గోదావరి కార్యాలయం ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని అటు జలవనరులశాఖ భావిస్తోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

ఎక్కడికక్కడ భయానకం...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు,మధ్యడెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ,తూర్పుడెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్లు లక్షల ఎకరాల సాగు,తాగునీటికి ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. వీటి వెంబడి ఉన్న వందలాది గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. గృహనిర్మాణ వ్యర్థాలు,చికెన్, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వ్యర్థాలను కాలువల్లో వదిలేస్తున్నారు. కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలు ఉన్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు కలిపేస్తు న్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు.ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నా బయటకు తెలియడం లేదు. పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో ఎన్నో పరిశ్రమలున్నాయి. వీటిలో కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి. కానీ ఖర్చు సాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. రాజమహేంద్రవరంలో మురుగునీటిని నల్లా ఛానల్ ద్వారా గోదావరిలో కలిపేస్తారు. కలుషితం అని తెలిసినా ఈ నీటినే ఓ మోస్తరు శుద్ధిచేసి పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రజలకు తాగునీటిగా సరఫరా చేస్తున్నాయి.

నాడు గాలికొదిలేసిన వైసీపీ

గత వైసీపీ సర్కారు మిషన్ క్లీన్ గోదావరి పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది.సీఎం చైర్మన్‌గా ఉండే ఈ బోర్డు ద్వారా జిల్లాలో గోదావరి కాలువలను శుద్ధి చేసి,ఆ తర్వాతే నీటిని కాలువల్లోకి వదులుతామని.. రూ.100 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్టు అప్పటి సీఎం జగన్ పలు సమీక్షల్లో గొప్పగా ప్రకటించారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలువల వద్ద ఎక్కడెక్కడ పరిస్థితి తీవ్రంగా ఉందో అధ్యయనం చేశారు. తీరా నిధులు అవసరమైన తరుణంలో అప్పటి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా నిధులు మంజూరు చేయలేదు. కేవలం నిధులిస్తున్నట్టు కాగితాలపై ఆదేశాలు జారీచేశారు. ఇలా మొన్న దిగిపోయే వరకు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై మాటలు తప్పించి పనులు జరిగేలా కనీస శ్రద్ధ చూప లేదు. దీంతో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు పూర్తిగా అటకెక్కినట్లయ్యింది. గత ఐదేళ్లలో గోదావరి కాలువల నిర్వహణను జగన్ సర్కారు గాలికివదిలేసింది.అటు పూడిక పెరగడం, మరో పక్క కాలుష్య తీవ్రత మరింత పెరిగి ప్రస్తుతం అత్యంత హానికరంగా తయారయ్యాయి.



ఇంత దారుణమా : కాలువ ఒడ్డున వేసిన చెత్త

కూటమి..పట్టాలెక్కించాలి..

కూటమి ప్రభుత్వం గోదావరి కాలువలపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టుకు ఇటీవల ఓ ఐఏఎస్‌ను కూడా సర్కారు నియమించింది.దీంతో ఎంతో కొంత నిధులు, లేదా కంపెనీల సీఎస్ఆర్ నిధుల సాయంతో కాలువల ప్రక్షాళన చేయాల్సి ఉంది.ఇదే విషయమై జలవన రుల శాఖ సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టుకు గత ప్రభుత్వం పైసా కూడా ఇవ్వని నేపథ్యంలో ఏం చేయలేకపోయామని దీంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగిందని వివరించింది.కూటమి ప్రభుత్వం గోదావరి కాలువల్లో కాలుష్యాన్ని నివారించే ప్రాజెక్టును పట్టాలెక్కి స్తుందని ఆయాశాఖల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.






మట్టా ప్రకాశ్‌గౌడ్.. కొల్లాబత్తుల అప్పారావు.. దానం లాజర్‌బాబు.. నక్కా నారాయణమూర్తి

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా పలువురికి చాన్స్

పిఠాపురం/కాకినాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో కాకినాడ జిల్లాకు చెందిన పలువురికి అవకాశం లభించింది. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టరుగా పిఠాపురం పట్టణానికి జనసేన నాయకుడు దానం లాజర్‌బాబు నియమితులయ్యారు. ఈయన మాలమహాగర్జన వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు. జనసేనలో క్రియాశీలకంగా ఉంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇదే కార్పొరేషన్ డైరెక్టరుగా కాకినాడ రూరల్ నియోజకవర్గం టీడీపీకి చెందిన కొల్లాబత్తుల అప్పారావు డైరెక్టరుగా నియమితులయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్.అచ్యుతాపురంనకు చెందిన అప్పారావు గతంలో కాకినాడ సూపర్‌బజార్ ఉపాధ్యక్షులుగా పనిచేశారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన జనసేన పార్టీ అధ్యక్షుడు నక్కా నారాయణమూర్తి నియమితులయ్యారు. ఈయన జనసేనలో క్రియాశీలకంగా ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారు.. ఇక రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి బీజేపీకి చెందిన మట్టా మంగరాజు, కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి టీడీపీ నేత మట్టా ప్రకాష్ గౌడ్, పెద్దాపురం నియోజకవర్గం టీడీపీ నేత బడుగు శ్రీకాంత్‌లు నియమితులయ్యారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన ప్రకాష్‌గౌడ్ గతంలో ఎంపీటీసీగానూ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులుగానూ పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శిగా ఉన్నారు.

అసెంబ్లీలో చినరాజప్ప, సత్యప్రభ వాయిస్

సామర్లకోట/ప్రత్తిపాడు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ప్రాజెక్ట్ ఆధునీకరణకు గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కింది స్థాయిలో డ్యామ్‌లు, వంతెనలు కూలిపోయాయని ఏలేరు ఆధునికీకరణకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసి ఏలేరు ప్రాజెక్ట్ ఆయకట్టుదారులకు సమృద్ధిగా సాగునీటి సరఫరా చేయడమేగాక పలు వంతెనలు పునర్ నిర్మించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అసెంబ్లీలో మంగళవారం కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. కాగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉన్నా నిరుపయోగంగా మారాయని, గోదావరి జలాలను ఏలేరు ఎడవ కాలువ ద్వారా నియోజకవర్గానికి మళ్లించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గోదావరి జలాలను ఏలేరు ఎడవ కాలువ ద్వారా పలుచోట్ల స్లూయిజ్‌లు ఏర్పాటుచేసి సరఫరా చేయాలని కోరారు.



పారిశుధ్య సేవలందిస్తున్న క్లాప్‌మిత్రలను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని నిర్మించుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మగౌరవ సూచిక-ఆరోగ్య జీవన దీపిక అయిన మరుగుదొడ్డిని జిల్లాలో ప్రతి కుటుంబం నిర్మించుకుని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్‌డే పురస్కరించి కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం, డిస్ట్రిక్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత, టాయిలెట్ వినియోగంపై జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ ప్రచురించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల తాగునీటి వనరులు కలుషితమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. 2014 నుంచి దశాబ్దకాలంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాల ద్వారా మరుగుదొడ్డి లేని కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి జిల్లాలో బహిరంగ మల విసర్జన దుస్సాంప్రదాయాన్ని అరికట్టగలిగామన్నారు. జిల్లాలో మొత్తం 3,89,205 కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకూ 3,86,393 కుటుంబాలు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్నాయన్నారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవలసిన 2,822 కుటుంబాలకు వాటిని మంజూరుచేస్తామని, ఆయా కుటుంబాలు మరుగుదొడ్లను సత్వరం నిర్మించుకోవాలన్నారు. మంగళవారం నుంచి వచ్చే డిసెంబరు 10న హ్యూమన్ రైట్స్‌డే వరకు మరుగుదొడ్ల వినియోగ ఆవశ్యకత పట్ల ప్రజాచైతన్యాన్ని పెంపొందించేందుకు మన మరుగుదొడ్డి-మన గౌరవం (హమారా సౌచాలయ్-హమారా సమ్మాన్) కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నూరుశాతం మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. జలజీవన్ మిషన్ కింద 408 కోట్ల అంచనాతో జిల్లాలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ కల్పించి రోజుకు 55 లీటర్ల తలసరి నీటి సరఫరా కల్పించేందుకు 667 ఆవాసాల్లో చేపట్టిన 874 పనుల్లో ఇప్పటికే 552 పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ భారతి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీవో రవికుమార్, డీయంహెచ్‌వో నరసింహ నాయక్, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.





ఎస్పీ కార్యాలయంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్.. జేఎన్టీయూకేలో ఎస్పీ ప్రసంగం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

జేఎన్టీయూకే, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మన దేశంలో 90 శాతం మంది స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారని, దీన్ని వినియోగించేటప్పుడు జాగ్రత్త వ్యవహరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. కాకినాడ జేఎన్టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో సైబర్ భద్రతపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం వర్సిటీ, యూసీఈకే ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌లు, జిల్లా పోలీస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్‌విష్ణు, ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, యువత స్మార్ట్ ఫోన్లకు వచ్చే అనుమానాస్పద లింక్‌లను తెరవకుండా ఉండాలన్నారు. సైబర్ క్రైం ద్వారా ఎవరైనా తమ బ్యాంక్ ఖాతాల్లోని డబ్బులను పోగొట్టుకున్నట్టయితే నిర్దీత సమయంలో 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదుచేయడం ద్వారా బ్యాంకు లావాదేవీలను స్తంభింపజేయవచ్చన్నారు. డిజిటల్ అరెస్ట్, స్టాక్‌మార్కెట్, కేవైసీ మోసాల పేర్లతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, సైబర్ భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు డి.రామారావు, ఎన్.రమేష్, బి.పెద్దిరాజు, ఎస్ఐ రమేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కాకినాడ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ, వార్డు మహిళా పోలీసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళా పోలీసులు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్



నవంబర్ నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు : ....

డోర్ నెంబరు : ....

వీధి పేరు : ....

గ్రామం / పట్టణం : ....

మండలం : ....

జిల్లా : ....

పోస్టల్ పిన్‌కోడ్ : ....

ఫోన్ నంబర్ : ....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది నవంబర్ నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి నాలుగు నెలలు ఆయిన తర్వాత మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, డో.నెం.114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్డు, పాలచర్ల (గ్రామం), రాజానగరం మండలం, రాజమహేంద్రవరం పిన్-533 102.

బ్రాంచ్ మేనేజర్ : 9985411241, సర్క్యులేషన్ మేనేజర్ : 9985411247



పిల్లలకూ ఉంది.. రాజ్యాంగం

రేపటి పౌరుల పరిరక్షణ దేశానికి రక్షణ

పిల్లలకు బాధ్యతలూ నేర్పడమూ పెద్దల బాధ్యతే

నేడు బాలల హక్కుల సంరక్షణ దినం

రాజమహేంద్రవరం/కార్పొరేషన్(కాకినాడ), నవంబరు19(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని అంటారు. అది అక్షర సత్యమే. ఆ బాలల హక్కులను కాపాడుతూ, బాధ్యతలను అలవర్చినప్పుడే మంచి సమాజం తద్వారా మెరుగైన దేశాన్ని చూడవచ్చు. బాలలకు ప్రత్యేక హక్కులు సంక్రమించి మూడు దశాబ్ధాలు దాటినా వాటి అమలు వెనుకబడిపోయింది. బడిలో ఉండాల్సిన బాల్యం దుకాణాల్లో బండెడు చాకిరీ చేస్తోంది. సిగ్నళ్ల వద్ద చిన్నారులు యాచించడం వ్యవస్థల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. అక్షరాలు దిద్దాల్సిన వయసు వెట్టిచాకిరీల్లో మగ్గిపోతోంది. బాల్యవివాహాల్లో చిన్నారి వధువులు సమిధలుగా మారిపోతున్నారు. నేడు బాలల హక్కుల పరిరక్షణ దినోత్సం సందర్భంగా జాతి సంపద హక్కులపై కథనం..

బాలలకు ప్రత్యేక హక్కులు

ప్రపంచవ్యాప్తంగా పిల్లల సంక్షేమాన్ని సంరక్షించడానికి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1959 నవంబరు 20న బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. అందువల్ల ఆ రోజున బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పెద్దవాళ్లకు ఉండే హక్కులన్నీ పిల్లలకూ రాజ్యాంగం అందించింది. రేపటి పౌరుల కోసం ఐక్యరాజ్య సమితి 1989లో దేశాల నడుమ ఒడంబడిక ద్వారా బాలలకు ప్రత్యేక హక్కులను ఇచ్చింది. మన దేశం వాటిని 1992లో ఆమోదించి ఒడంబడికపై సంతకం చేసింది. అప్పటి నుంచీ బాలల హక్కులు సంరక్షించడానికి, అమలుచేయడానికి వివిధ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. బాలల హక్కుల ఒడంబడికలో 1 నుంచి 41 వరకూ బాలలకు సంబంధించిన అంశాలు, 42 నుంచి 46 వరకూ వాటిని అమలు చేసే విధానాలు, 47 నుంచి 54 వరకూ అంతర్జాతీయ ప్రమాణాలు, బాధ్యతల గురించి వివరించారు. వీటి ప్రకారం 18ఏళ్లలోపు వయసు వారందరినీ బాలలుగానే పరిగణిస్తారు. బాలల హక్కులను నాలుగు మూల సూత్రాల ఆధారంగా రూపొందించారు. వివక్షతకు తావు ఉండకుండా బాలల అభిప్రాయాలకు అత్యున్నత ప్రాధాన్యమివ్వాలని, వారికి జీవించే హక్కును కల్పించడంతోపాటు భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కును అందించాలనే మూల స్తంభాల మీద బాలల హక్కుల ఒడంబడిక కుదిరింది. మొత్తం హక్కులను జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే, భాగస్వామ్యం పొందే హక్కులుగా విభజించారు.

కాకినాడ జిల్లాలో...

బాలల హక్కుల కోసం కాకినాడ జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2024లో 250 పాఠశాలలు, 30 కళాశాలల్లో అవగాహన తరగతులు, 36 బాల్యవివాహాలు నిలుపుదల, భిక్షాటన చేసే 35 పిల్లలను రెస్క్యూ చేసి 14మందిని తల్లిదండ్రులకు అప్పగించి 21మందిని పాఠశాలల్లో చేర్పడం జరిగింది. గత సంవత్సరాల్లో ఫోక్సో బాధిత బాలికలకు ఈ ఏడాది 75 మందికి పరిహారం ఇచ్చారు. అనాథలుగా నిరాదరణకు లోనైన 410 మంది బాలలకు స్పాన్సర్‌షిప్ అమౌంట్ ఇచ్చారు. అనాథలుగా వదిలివేసిన 11మంది బాలలకు టీఏఆర్ఏ ద్వారా దత్తత ప్రక్రియ పూర్తి చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



సమాజంలో ప్రతి ఒక్కరూ బాలలపై లైంగిక వేధింపులను వ్యతిరేకించాలి. ఎక్కడైనా బాలల ను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించకూడదు. ఎవరైనా ఎటువంటి ఆపదలో ఉన్నా, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారమివ్వాలి. ప్రభుత్వపరంగా సమాజంలో బాలల హక్కుల పరిరక్షణకు మా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చిన్నారి రక్షణ, కిశోర వికాసం వంటి కార్యక్రమాలు నిర్వహణతోపాటు వారి రక్షణ, పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తున్నాం.

- కొండా ప్రవీణ, కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ



పి.మల్లవరంలో వరిచేలో బర్మాబ్లాక్ వరి సాగు.. రైతు రమణ



ఈ రైతు రూటే సెపరేటు

ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శ రైతు

బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా రకాలతో వరి సాగు

తాళ్లరేవు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులతో పనిలేకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను సాధించే దిశగా కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం బాటపడుతున్నారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు మళ్లేలా రైతు దూళిపూడి వెంకట రమణ అనే రైతు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామంలో 50 సెంట్ల వరిపొలంలో ప్రకృతి వ్యవసాయ సాగును ప్రాజెక్టుగా తీసుకుని జీవామృతం, కషాయాలతో వ్యవసాయ సాగుచేశారు. 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆకుమడి దమ్ముకి రూ.1500, 7 కిలోలను ఆకుమడి విత్తనాలు చల్లారు. దీనికి కిలో రూ.140 చొప్పున 7 కిలోల ఖర్చు రూ.980 అయింది. అలాగే గట్టులంకలకు రూ.1200, వరి నాట్లు వేయడానికి రూ.2000, రెండుసార్లు కసాయంలను పిచికారి చేయడానికి రూ.1200 ఖర్చయ్యిందంటున్నారు. ప్రస్తుతం బర్మా బ్లాక్ వరి రకాన్ని మాత్రమే సాగుచేశానని, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా వరి రకాలను సాగు కోసం సిద్ధం చేసుకున్నట్లు రైతు వెంకట రమణ తెలిపారు. పంట బాగుందని, ఎలాంటి చీడపీడలతో నష్టం జరగలేదని ఆయన చెప్పారు.

ఈ బియ్యంతో ప్రయోజనాలెన్నో..

బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్ వంటి విత్తనాలు.. నలుపు రంగులో ఉంటాయి. అధిక యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ కలిగినవి. ఈ బియ్యం వల్ల కలిగే కేన్సర్, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి అనారోగ్యాల బారిన నుంచి రక్షణ కల్పిస్తుంది. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను సైతం తగ్గిస్తుంది. ఈ బియ్యంలో విటమిన్ బీ, ఇ, నియాసిన్, కాల్షియం, మెగ్నిషియం, ఐరన్, జింకు వంటి ఖనిజ విలువలు, పీచు పదార్థాలు అధికం. ఈ బియ్యంలో ఆంకోసైనిన్స్, యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేయడమేగాక రోగనిరోధక ఎంజైములను క్రియాశీలకం చేస్తుందని చెబుతున్నారు.

మైసూర్ మల్లిగా..

మైసూర్ మల్లిగా రకం సంప్రదాయ రకాల్లో ఒకటి. బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. ఎదిగే పిల్లలకు అవసరమైన అధిక పోషకాలు, ప్రొటీన్స్ లభించే గుణం కలిగి ఉంది. పిల్లలకు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. పిల్లలకు ఈ బియ్యంతో ఆరోగ్య సంబంధమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం సాగులో ఈ రకాన్ని ఎక్కువ పండిస్తున్నారు.

స్టాంపులకు.. ఆధారమే!



కూటమి సర్కారు నూతన విధానం

- తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- అక్రమాల నియంత్రణే లక్ష్యం
- నకిలీలకు అడ్డుకట్ట
- కృత్రిమ కొరతకు చెక్

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడీషియల్ స్టాంపు అమ్మకాలు తీరును సంస్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల అమ్మకాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది.గత వైసీపీ ప్రభుత్వం ఈ స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి ప్రజల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం నాన్ జుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గు చూపింది. ఇందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద సంఖ్యలో స్టాంపులను తెప్పించి అన్ని జిల్లాలకు సరఫరా చేసింది. నాన్ జుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదుచేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపు వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. అయితే కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంపులు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించే వారన్న విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. నకిలీ స్టాంపులు కొన్ని చోట్ల బహిర్గతమైన సందర్భాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది.ఇందుకు అనుగుణంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఆధార్ తప్పనిసరి ..

ఒకటి, అంతకన్నా ఎక్కువగా నాన్ జుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేసినా కొత్త విధా నంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమో దు చేసుకోవాల్సిందే. స్టాంపులు పొందడానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆధార్ నెంబరును కంప్యూటర్‌లో నమోదు చేయాలి. వివరాల నమోదు తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి 10 స్టాంపులు వరకూ కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబర్ నమోదు చేయడం వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది.

లెక్క తెలిసిపోతుందిలా..

స్టాంపుల విక్రయాల్లో గతంలో మాదిరిగా రికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. రిజిస్టర్లు , అకౌంట్ పుస్తకాలు కలిగి ఉండే స్టాంపు వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకా శం కలిగింది.ఈ క్రమంలో విక్రయాలు తక్కు వగా జరిగే కార్యాలయాల నుంచి ఎక్కువ వినియోగం ఉండే కార్యాలయాలకు స్టాంపులను తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. కూటమి ప్రభుత్వ ఆలోచనపై హర్షం వ్యక్తమవుతుంది. ఎందుకంటే స్టాంప్‌ల కారణంగా చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆధార్ నెంబర్ తప్పనిసరి చేయడంతో ఆ ఇబ్బందులు కొంత వరకూ తగ్గే అవకాశం ఉంటుంది.

అందుబాటులో స్టాంపులు

నాన్ జుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నంబర్ నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది.స్టాంపు వెండర్లు నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి.

- కె.ఆనందరావు, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ



సోషల్ మీడియాలో వికృత క్రీడ!

- గీత దాటితే తప్పవు కేసులు, జైలు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఎసరే
- తునిలో డిజిటల్ మీడియాలో అభ్యంతరకర, అసభ్య పోస్టులు పెడుతున్న 17 మంది అరెస్టు

తునిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. రాజకీయ ప్రచారానికి వినియోగించడంతోపాటు ప్రత్యర్థులు, వారి కుటుంబీకులు, ఆ కుటుంబాల మహిళలు, చిన్నపిల్లలపై బూతులతో విరుచుకుపడుతున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. మార్ఫింగ్ ఫోటోలతో తమ పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ ఇష్టమైన నేతల కళ్లల్లో ఆనందం కోసం వికృత చేష్టలతో ఇతరులను తూలనాడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. వీరిలో విద్యాధికులే అధికంగా ఉండడం, అందులోని ఎక్కువశాతం యువకులు ఉండడం ఆందోళన కలిగించే అంశం. సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా సైకోలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. తునిలో వైసీపీ సానుభూతి పరులు తమ నేత కళ్లల్లో ఆనందం చూడడం కోసం సోషల్ మీడియా వేదికపై వికృత చేష్టలకు పాల్పడుతూ పెద్దసంఖ్యలో పోలీసులు పట్టుపడుతున్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఫేక్ అకౌంట్లతో రాజకీయ నాయకులు, వారి కుటుంబీకులపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్న వారిపై వారిని గురించి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. తీగ లాగితే డొంక కదిలిందన్న చందాన వీరి సోషల్ మీడియా అకౌంట్‌లకు తుని నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి సంబంధాలు ఉండడంతో పోలీసులు మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా పోలీసులు యువతను చైతన్యపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో గీత దాటితే వేటు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువత అప్రమత్తం అవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఫేక్, మార్ఫింగ్ పోస్టింగ్‌లు పెడితే..

ఫేక్, మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలు పెడితే అవతల వారి వ్యక్తిత్వాన్ని అవమానిస్తే డీఎన్ఎస్ 67 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువు అయితే 3 ఏళ్ల జైలుశిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తారు.

● అసభ్యకర పోస్టులు పెడితే..

67ఏ సెక్షన్ కింద కేసు నమోదవుతుంది. 5 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఇంకా...

- ప్రముఖ వ్యక్తుల పేరుతో అసభ్యకర పోస్టులు పెడితే 66(డి)సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారు. 3 ఏళ్ళు జైలుశిక్ష, రూ.1 లక్ష వరకు జరిమానా విధిస్తారు.
- తప్పుడు పత్రాలు సృష్టించి ఒక వ్యక్తి పరువుకుభంగం కలిగిస్తే బీఎన్ఎస్ చట్టంలోని 336(4)సెక్షన్ కింద కేసు పెడతారు.
- సంఘంలోని సమూహాలు, సంఘాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే బీఎన్ఎస్ చట్టంలోని 362(2)సెక్షన్‌తో పాటు పరువు నష్టం కింద కేసు నమోదవుతుంది.
- జుగుప్సాకరంగా ఉన్న చిత్రాలు, ఫొటోలు పోస్ట్ చేస్తే ఎలక్ట్రానిక్ ఆధారాలుగా పరిగణించి బీఎన్ఎస్ చట్టంలోని 353(2)కింద కేసు తప్పదు.

● ఈ కేసుల్లో ఇరుకుంటే..

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారిలో యువత, విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగ నియామక సమయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఉద్యోగాల నియామకాల సమయంలో పోలీస్‌శాఖ నిరంభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ)పత్రం జారీచేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తే వారిపై కేసు నమోదై ఉంటే వారికి ఎన్‌ఓసీ జారీచేయరు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాలకు వెళ్లేవారికి పాస్‌పోర్టు జారీ సమయంలో ఇబ్బంది తప్పదు. కేసులు నమోదై ఉంటే పోలీసుల తనిఖీ సమయంలో తోసిపుచ్చుతారు. కొందరు ఈపాటికే విదేశాల్లో ఉండి అక్కడ నుంచి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర మార్ఫింగ్ పోటోలతో పోస్టులు పెడుతున్నారు. తాము దూరం ప్రాంతంలో ఉన్నామనే భ్రమలో రెచ్చిపోతున్నారు. అటువంటి వారిపై కేసు నమోదైతే లుక్‌అవుట్ జారీచేస్తారు. దేశంలో ఎప్పుడైనా అడుగుపెడితే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు.

● పరిశీలనలో ప్రతి ఖాతా : సీఐ

సామాజిక మధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినా అసభ్యకర పదజాలంతో రెచ్చిపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు చెప్పారు. సైబర్ క్రైం, సామాజిక మాధ్యమాలపై సైబర్ సెల్ విభాగం పూర్తిగా నిఘా పెట్టిందని, రోత పోస్టులు పెడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

తునిలో 17 మంది అరెస్టు.. రిమాండ్

తుని రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి డిజిటల్ సోషల్ మీడియా వేదికల్లో ప్రభుత్వంపైనా, ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలకు వ్యతిరేకంగా వైసీపీకి లబ్ధి చేకూర్చేలా ప్రచారం చేస్తూ రాజకీయ అనిశ్చితిను ప్రేరేపించేందుకు పాల్పడుతున్న వారిపై కాకినాడ జిల్లా తుని పట్టణ, గ్రామీణ పోలీసులు కొరడా ఝుళిపించారు. సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారానికి పాల్పడుతున్న 17 మందిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పలువురిని రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నాగం గంగబాబు, అడపా సురేష్, గణేశుల వీరబాబు, చింతకాయల చినబాబు, బంగారు బ్రహ్మానాయుడు, యలమంచిలి మణికంఠ, చింతమనీడి గణేష్, కాకినాడ నానితోపాటు తుని మునిసిపల్ కౌన్సిలర్ షేక్ క్వాజా మెహిద్దీన్, ఏలూరి బాలు, వెలుగొండి జార్జ్ కిరణ్, ఇసరపు సాయి, మొగసాల నాగ రామశ్రీను, ఇబ్బ శ్రీను, పెంటకోట వెంకటరమణ, కోరుమిల్లి లలితపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతుందని, విచారణ అనంతరం ఇందులో ఇంకా ఎవరి భాగస్వామ్యమైనా ఉంటే అరెస్టు చేస్తామన్నారు. యువత సోషల్ మీడియాలో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనం అవుతుందని ఆయన హెచ్చరించారు.



తునిలో మీడియాతో మాట్లాడుతున్న తుని పట్టణ, రూరల్ సీఐలు చెన్నకేశవరావు, గీతారామకృష్ణ



కాకినాడ రేచర్లపేటలోని ఇల్లు.. కాగ్ చీఫ్ సంజయ్‌మూర్తి

కాగ్ చీఫ్ మనోడే

మాజీ ఎంపీ కేఎస్సార్ తనయుడే సంజయ్‌మూర్తి

1996లో ఎంపీగా పనిచేసిన కేఎస్ఆర్.మూర్తి

ఈ ప్రాంత ప్రజలతో సంజయ్‌మూర్తికి సంబంధాలు

అమలాపురం/కాకినాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) చీఫ్‌గా నియమితులైన కె.సంజయ్‌మూర్తికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయన తండ్రి విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఎస్సార్ మూర్తి కాంగ్రెస్ పార్టీ నుంచి అమలాపురం లోక్‌సభ రిజర్వుడ్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. ఆ సమయంలో ఆయన తనయుడైన కె.సంజయ్‌మూర్తి పలు సందర్భాల్లో కోనసీమ ప్రాంతంలో పర్యటించారు. ఈ ప్రాంత ముఖ్యులతో పరిచయాలు కలిగి ఉన్నారు. 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కేఎస్సార్ మూర్తి కాంగ్రెస్ పార్టీ నుంచి అమలాపురం ఎంపీ స్థానానికి ఎన్నికయ్యారు. అంతకు పూర్వం నుంచే సీనియర్ ఐఏఎస్ హోదాలో ఈ ప్రాంత ప్రజలతో సంబంధాలు, బంధుత్వాలు కూడా మూర్తికి కలిగి ఉన్నాయి. ఈ జిల్లాలోని ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆలయం నిర్వహణలో కేఎస్సార్ మూర్తి కీలక పాత్ర వహించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఆయన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. తండ్రి అడుగు జాడల్లోనే నడిచే సీనియర్ ఐఏఎస్ అధికారిగా కె.సంజయ్‌మూర్తికి మంచి పేరు ఉంది. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ కేడర్ నుంచి కాగ్‌కు ఎంపికయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కె.సంజయ్‌మూర్తిని కాగ్ చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం సంజయ్‌మూర్తి కేంద్ర విద్యాశాఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈనెల 21న సంజయ్ పదవీ బాధ్యతలను చేపట్టనున్నారు. కాకినాడ జిల్లా రేచర్లపేటకు చెందిన కేఎస్సార్ మూర్తి దంపతులకు సంజయ్‌మూర్తి జన్మించారు. ఎంపీగా పనిచేసిన ఆయన తండ్రి కేఎస్సార్ మూర్తికి కోనసీమలో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో కోనసీమలో మంచినీటి పథకాల అమలుకు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తుల్లో కేఎస్సార్ మూర్తి ఒకరు. ఈ ప్రాంతంలో అప్పట్లో జరిగిన కార్యక్రమాలకు తనయుడు సంజయ్‌మూర్తి కూడా అప్పుడప్పుడూ హాజరై ప్రజలతో మమేకమయ్యేవారు.

పెరిగింది కాకినాడలోనే..

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా నియమితులైన తొలి తెలుగు వ్యక్తి సంజయ్ మూర్తిది కాకినాడ కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అత్యున్నత పదవి తొలిసారిగా తెలుగు అధికారికి దక్కడం, అదీ ఆయన కాకినాడ రేచర్లపేటకు చెందిన వారు కావడంతో ఆయన గురించి తెలిసిన వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంజయ్ మూర్తి తండ్రి కోండ్రు శ్రీరామచంద్రమూర్తి 1996లో అమలాపురం ఎంపీగా పనిచేశారు. అంతకు ముందు ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేశారు.ఎంపీగా చేసిన కాలంలో కాకినాడ రేచర్లపేటలోని సొంతింట్లోనే ఉండేవారు. అదే సమయంలో తల్లితో కలిసి కొంతకాలం ఇక్కడే సంజయ్‌మూర్తి ఉన్నారు.తండ్రి ఐఏఎస్ కావడంతో సంజయ్‌మూర్తి చదువంతా ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడిచింది.ఆ తర్వాత సంజయ్ 1989లో ఐఏఎస్‌కు ఎంపికవడంతో హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌లో చాలాకాలం పనిచేశారు. పండగ సమయాల్లో మాత్రం కాకినాడ రేచర్లపేటకు వచ్చి కొన్నిరోజులు గడిపేవారు. రేచర్లపేటలోని సొంతింట్లో ప్రస్తుతం సంజయ్ కుటుంబీకులు ఎవరూ లేరు.కొన్నాళ్ల కిందట సంజయ్‌మూర్తి తల్లిదండ్రులు చనిపోవడంతో ఉంటున్న ఇంటిని అద్దెకు ఇచ్చేశారు.



ఎంత మంది పిల్లలున్నా పోటీకి ఓకే!

- స్థానిక సంస్థలకు సంతానం నిబంధన ఎత్తివేత
- చట్ట సవరణ చేస్తూ ప్రభుత్వ నిర్ణయం

పెద్దాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి వరకూ ఉన్న ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయనున్నారు. ఇకపై ఎంత మంది పిల్లలు ఉన్నా పట్టణ స్థాయి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులుగా ప్రకటించింది.ఈ బిల్లు 2024లోనే అమల్లోకి రానుంది.ఈ మేరకు మునిసిపల్ మంత్రి నారాయణ సభలో సైతం ప్రతిపాదించారు. జనాభా వృద్ధి రేటు పెంపుదలలో భాగంగానే చట్టంలో మార్పులు తెచ్చినట్లు స్పష్టం చేశారు. మునిసిపల్ శాసనాల సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం కూడా తెలిపింది. ఈ మేరకు చట్టానికి సైతం సవరణలు చేయనున్నారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని ఎప్పటి నుంచో వస్తున్న డిమాండ్లకు కూటమి ప్రభుత్వం అమోదం తెలియచేయడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పట్టణ స్థానిక సంస్థల అభ్యర్థులకు ఏఏ సందర్భాల్లో ఇందులో మినహాయింపులతో కూడిన వెసులుబాటు లభిస్తుందనే విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి వివరణ ఇవ్వాల్సి ఉంది. శాసనమండలి ఆమోదం పొందిన తరువాత జీవో జారీ చేయగానే కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని ప్రకటించారు. గతంలో ఇద్దరు కంటే ఎక్కువ సంతానం ఉన్న వారు పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత లేకుండా ఉండేవారు. కొత్త నిబంధనతో ఎంత మంది పిల్లలు ఉన్నా ఎన్నికల్లో పోటీకి అర్హులే.

ఒక్కటైన ఐఏఎస్‌లు

» విశాఖలో ప్రేమ వివాహం..
బిళ్లకుర్రులో రిసెప్షన్

కొత్తపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ఐఏఎస్‌లు.. ప్రేమ వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. కొత్తపేట మండలం బిళ్లకుర్రులో రిసెప్షన్ వేడుక నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలం బిళ్లకుర్రు తరిట్లవారిపేటకు చెందిన తరిట్ల ధర్మారావు మధ్యప్రదేశ్‌లో కలెక్టర్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు తరిట్ల ప్రతీక్‌రావు, హైదరాబాద్‌కు చెందిన కె.అనీషా.. ఇద్దరూ 2023లో ఢిల్లీ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందారు. అప్పటి పరిచయం మేరకు వీరిద్దరూ విశాఖలో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రతీక్‌రావు స్వగ్రామమైన తరిట్లవారిపేటలో మంగళవారం పెద్దల సమక్షంలో రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించగా పలువురు హాజరై ఆశీర్వదించారు.


కొత్తపేట మండలం బిళ్లకుర్రు తరిట్లవారిపేటలో రిసెప్షన్‌లో ఐఏఎస్‌లు

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.73 కోట్లు

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,73,10,259 నగదు, 28.500 గ్రాముల బంగారం, 862 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటు యుఎస్ఏకు చెందిన 162 డాలర్లు, కెనడా 15 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, ఆస్ట్రేలియా 25 డాలర్లతోపాటు పలు దేశాల విదేశీ కరెన్సీ సమకూరాయి. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 20 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.8.65 లక్షల ఆదాయం హుండీల ద్వారా లభించింది.


హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వచ్చేనెల 28న క్రియ పిల్లల పండుగ

» కాకినాడ జేఎన్‌టీయూ వేదికగా నిర్వహణ

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు19(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 28, 29 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో క్రియ పిల్లల పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీనిలో భాగంగా 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు జరగనున్నాయి. విద్యార్థులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, పాటలు, పోస్టర్ ప్రజంటేషన్, కథారచన, చిత్రలేఖనం, బుర్రకథ, జానపదనృత్యం, విచిత్ర వేషధారణ, కథ చెప్పడం, వాద్య సంగీతం వంటి పోటీలు నిర్వహిస్తారు. 400 పాఠశాలల నుంచి 12వేల మంది వరకు విద్యార్థులు వస్తారని అంచనా వేస్తున్నారు. 1నుంచి 5వ తరగతి వరకు సబ్‌జూనియర్ కేటగిరీలో, 6 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ కేటగిరీలో, 8 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ కేటగిరీలో పోటీలు జరుగుతాయి. www.kriyaonline.org వెబ్‌సైట్ ద్వారా స్కూల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చును.

సక్రమంగా ఆరుగురి నామినేషన్లు

» కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్‌లు పరిశీలన చేశారు. ఆరుగురు అభ్యర్థులు వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. మంగళవారం నామినేషన్లను ఎవరూ ఉపసంహరించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయఎమ్మెల్సీ అభ్యర్థులు బుర్ర గోపీమూర్తి, గంధం నారాయణరావు, నామ వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగుదీపక్, అహ్మద్‌షేక్, డీఆర్‌వో వెంకట్రావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా...

భీమేశ్వరస్వామి తెప్పోత్సవం


భీమేశ్వరస్వామి ఆలయ కోనేరు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

» భక్తుల శివనామస్మరణ మధ్య నిర్వహణ
» హంస వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
» ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ

సామర్లకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కోనేరు పుష్కరిణిలో మంగళవారం రాత్రి భీమేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరి ఉత్సవమూర్తులు నయనానందకరంగా అలంకరించిన హంస వాహనంపై విహరించే కార్యక్రమాన్ని వందలాది భక్తుల శివనామస్మరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముందుగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి, అమ్మవారి దేవతామూర్తులకు ప్రత్యేక శాంతికర పూజలను నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను అర్చకస్వాములు కోనేరు పుష్కరిణిలో విద్యుద్దీపాలంకరణలతోనూ, పూలతోనూ అలంకరించిన హంస వాహనంపై ప్రతిష్ఠించి తెప్పోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హంస వాహనంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, రైతుసంఘ అధ్యక్షులు కంటే జగదీష్‌మోహనరావు(బాబు), సీఐ శ్రీకృష్ణ భగవాన్, అర్చకస్వాములు ఆశీనులు కాగా కోనేరు పుష్కరిణిలో స్వామివారు, అమ్మవారు హంస వాహనంపై మూడు ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ తదితర భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



8నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

» 14 వరకూ ప్రత్యేక పూజలు


పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులు

పిఠాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో డిసెంబరు 8 నుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. 14 వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దత్త జయంతి మహోత్సవాల తొలి రోజు 8వతేది నుంచి 14వరకూ ప్రతిరోజూ మహాగణపతిపూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేద పారాయణ, రుత్విక్కులతో మూలమంత్ర అనుష్ఠానం, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, 5గంటలకు శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాదపద్మాలకు వివిధ హారతులు, స్వామి వారికి పల్లకిసేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుగుతాయి. 8వతేదీ ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదేరోజు సర్వపుష్పపూజ, 9న లక్షబిల్వార్చన, 10న సహస్ర చామంతి పూజ, 11న లక్షతులసి అర్చన, 12న సహస్ర లిల్లీ పుష్పపూజ, 13న గులాబి అర్చన, సంపెంగ పుష్పపూజ, 14న పూలంగిసేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్తజయంతిరోజు సాయంత్రం దత్తాత్రేయ స్వామిరథోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మహాసంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

అంతర కళాశాలల కబడ్డీలో జేఎన్టీయూకే జట్టుకు తృతీయస్థానం

జేఎన్టీయూకే, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16, 17 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైస్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో నిర్వహించిన జేఎన్టీయూకే అంతర కళాశాలల కబడ్డీ మహిళల పోటీల్లో జేఎన్టీయూకే జట్టు తృతీయస్థానంలో నిలిచినట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో 20 కళాశాలల జట్లు పాల్గొన్నాయన్నారు. ప్రతిభ కనబరచి తృతీయస్థానంలో నిలిచిన జట్టు క్రీడాకారిణులను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, శ్యామ్‌కుమార్ అభినందించారు.


కబడ్డీ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

బైక్‌ను ఢీకొన్న కారు

» ఇద్దరికి తీవ్రగాయాలు
» మండపేటలో ఘటన

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం కలవపువ్వుసెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలివి. మండపేట పట్టణానికి చెందిన వసంత టైలర్స్ యజమాని కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న సమయంలో అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో మండపేట పట్టణంలోని గాంధీనగరానికి చెందిన ఎం.పద్దయ్య, గొల్లపుంతకాలనీకి చెందిన రెడ్డి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మండపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మండపేటలో కారు ఢీకొట్టడంతో తిరగబడిపోయిన బైక్

స్కేటింగ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు పాశర్లపూడి కుర్రోడు


మిత్ర ఆరుష్

మామిడికుదురు,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామానికి చెందిన మార్లపూడి మిత్ర ఆరుష్ ఎంపికయ్యాడు. గతనెలలో హైదరాబాద్‌లో జరిగిన స్కేటింగ్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆరుష్ ప్రతిభ కనబరిచి ప్రపంచకప్‌కు ఎంపికైనట్టు అతడి తండ్రి శ్రీనివాసరావు తెలిపాడు. ఫుట్‌బాల్‌స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి టర్కీలోని టర్బన్ నగరంలో ఈనెల 20 నుంచి 26 వరకు జరగనున్నట్టు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతోపాటు తన కుమారుడు కూడా ఈ పోటీల్లో పాల్గొనేందుకు టర్కీకి బయలుదేరినట్టు ఆయన తెలిపారు. తమ గ్రామస్తుడు ప్రపంచ పోటీలకు ఎంపికవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

40కిలోల గంజాయి స్వాధీనం

» మోతుగూడెంలో వేర్వేరు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పోలీసులు

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో వేర్వేరు తనిఖీల్లో 40కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీలేరునుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురిని మోతుగూడెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా గోదిసేలపేటకు చెందిన మద్దెల హరీష్, అలక్క సందీప్, పైడిపల్లికి చెందిన పెరుమాండ్ల ప్రవీణ్, మల్లిపల్లికి చెందిన జుంబిడి విజయ్ సీలేరు నుంచి కరీంనగర్‌కు 30కిలోల గంజాయిని తీసుకెళ్తుండగా సమాచారం రావడంతో పోలీసులు పట్టుకున్నారు. దాని విలువ రూ.1.50లక్షలు ఉంటుంది. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి అంబేడ్కర్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు గ్రామానికి చెందిన కన్నెబోయిన దుర్గాప్రసాద్, తులసిపాక గ్రామానికి చెందిన సమలం మల్లేష్, ఒడిశా రాష్ట్రం కలిమెల నుంచి పది కిలోల గంజాయిని ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా అరెస్ట్ చేశారు.


గంజాయితో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

లారీల డ్రైవర్లకు మొబైల్ స్లిప్‌లు

» సీతానగరంలో హైవేపై రెండు కిలోమీటర్ల మేర నిలిచిన ఇసుక లారీలు


రహదారిపై నిలిచిపోయిన ఇసుక లారీలు


మొబైల్ స్లిప్‌లు పంపిణీ వాహనం వద్ద లారీ డ్రైవర్లు

సీతానగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానంలో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం శ్రీరామనగరం పెట్రోల్ బంక్ నుంచి రాష్ట్ర హైవేపై మంగళవారం రెండు కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.ఇంతకీ అసలు దీనిపై ఏంటా అని ఆరా తీస్తే పెట్రోల్ బంక్ వద్ద మొబైల్ స్లిప్‌ల(కారులోనే స్లిప్‌ల పంపిణీ) కేంద్రం ఏర్పాటు చేశారు. లారీడ్రైవర్లు ఆ కారు వద్ద గుమిగూడి వాటిని తీసుకుంటున్నారు. దీంతో లారీలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. ఇసుక ర్యాంపువద్ద చేయాల్సిన పని రోడ్డుపై లారీలను నిలిపి పనులు చేసుకోవడంపట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఇసుక రవాణా లేకపోవడం, తిరిగి మంగళవారం ప్రారంభం కావడంతో ఇసుక లారీలు భారీ సంఖ్యలో వస్తున్నాయి.

సొంతగూటికి చేరడం సంతోషం ఉంది: టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరడం సంతోషంగా ఉందని, తన కుటుంబం రాజకీయ జీవితం ప్రారంభించిన సొంత గూటికి తిరిగి చేరానని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు ఎస్.రాజీవ్ కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీవర్గాలు, అభిమానులకు, నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం సందేశాలు పంపారు. తన మామయ్య కృష్ణబాబు ఐదు సార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. విజనరీ నేతలైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్.
Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:199719

4 Lines CLASSIFIED Rs.230/- Only

జగ్గంపేటలో 116 ఏళ్ల వృద్ధుడి మృతి


బూరా చిన్న అప్పారావు

జగ్గంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన శతాధిక వృద్ధుడు బూరాచిన్న అప్పారావు సోమవారం మృతి చెందాడు. జగ్గంపేటలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఆయన 116 సంవత్సరాలు జీవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందిరాగాంధీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంనుంచి ఈయన రాజకీయాల్లో పని చేస్తూ చివరి దశ వరకు ఆరోగ్యంగానే ఉన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి నడిచాడు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై కేసు

కాకినాడ క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన సంఘటన మంగళవారం కాకినాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడుకు చెందిన 17ఏళ్ల విద్యార్థిని అధికారి సత్యసాయి కరుణశ్రీ, కాకినాడ శాంతినగర్‌కు చెందిన 17ఏళ్ల విద్యార్థిని కటికలపూడి నాగశ్రీ కొత్త కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారిద్దరూ మంగళవారం కళాశాలకు డుమ్మా కొట్టి ఎస్ఆర్ఎంటీ మాల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి వేరేవాళ్ల ఫోన్‌లో ఇద్దరి ఇళ్లకు ఫోన్ చేసి తాము గుడికి వెళ్లి వస్తామని చెప్పి ఫోన్ పెట్టేశారు. అప్పటినుంచి విద్యార్థినులు ఇద్దరు ఇళ్లకు వెళ్లకపోయేసరికి ఇద్దరి తల్లిదండ్రులు కాకినాడ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థినుల ఆచూకీ కోసం సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.99లక్షలు

ఆత్రేయపురం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,99,009 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లంచం వ్యవహారంలో రాజమండ్రి సీఐ దుర్గారావు సస్పెండ్

గుడివాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడ టూటౌన్ సీఐగా పనిచేసిన కాలంలో లంచం వసూళ్ల కేసుల్లో ప్రస్తుత రాజమహేంద్రవరం సీఐ దుర్గారావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలిచ్చారు. 2022లో భూవివాదంలో దుర్గారావుపై ఏసీబీని ఫిర్యాదుదారుడు ఆశ్రయించారు. రెండు వర్గాలకు సంబంధించి రూ.30లక్షల వివాదాన్ని పరిష్కరించే క్రమంలో దుర్గారావు కొన్ని డాక్యుమెంట్‌లను బలవంతంగా తీసుకుని వ్యతిరేక వర్గానికి ఇచ్చారు. సదరు డాక్యుమెంట్‌లను వెనక్కి ఇవ్వాలని ఫిర్యాదుదారుడు సీఐని కోరగా డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా దర్యాప్తులో నేరం రుజువు కావడంతో సీఐ దుర్గారావుపై క్రిమినల్ కేసును పెట్టి సస్పెండ్‌కు సిఫారసు చేస్తూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

పదో తరగతి పరీక్ష ఫీజును 26 లోపు చెల్లించాలి

» కాకినాడ జిల్లా డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, ఒకసారి పరీక్షలకు హాజరై ఫెయిలైన విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 26 లోపు చెల్లించాలని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. నామినల్ రోల్స్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల27నుంచి డిసెంబరు 2లోపు,రూ.200 అపరాధ రుసుంతో డిసెంబరు 3వ తేదీ నుంచి 9వతేదీ లోపు, రూ.500 అపరాధ రుసుంతో 10వతేదీ నుంచి 16వతేదీ లోపు చెల్లించాలన్నారు. నామినల్ రోల్స్ తోపాటు పరీక్షఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన వర్మ

పిఠాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కలిశారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను కలిసిన వర్మ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కాలు జారిందా.. అంతే సంగతులు!

ఒకటే ఆర్టీసీ సర్వీస్
ఫుట్‌బోర్డుపై నిలుచునే
విద్యార్థుల ప్రయాణం

కొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడ పరిసర ప్రాంతాల విద్యార్థులు చదువుకోవడానికి కాకినాడ వెళ్లి రావాలంటే నరకం చూస్తున్నారు. కారణం కాకినాడ నుంచి ఉప్పాడకు ఆర్టీసీ బస్‌లు లేకపోవడమే. ఉన్న ఏకైక ఆర్టీసీ బీస్ తుని నుంచి ఉదయం, సాయంత్రం వస్తుంది. ఈ ఒకే బస్‌లో తుని నుంచి ఉప్పాడ బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడకు వివిధ పనుల నిమిత్తం, ప్రవేటు ఉద్యోగాలు చేసే వ్యక్తులు, ఫిషింగ్‌హార్బర్లో పనిచేసే కార్మికులు ప్రయాణిస్తుంటారు. ఈ బస్ ఉదయం సుమారు 8-9 గంటల మద్య ఉప్పాడ సెంటర్‌కు చేరుతుంది. వివిధ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉదయం పూట ఈ బస్సులోనే ప్రయాణించాలి. బస్ తుని నుంచి రావడంతో ఉప్పాడ సెంటర్‌కు చేరేసరికి ఫుల్‌రష్‌గా వస్తుంది. కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు ప్రతీ రోజూ ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేస్తున్నారు. దురదృష్టవశాత్తు ఫుట్‌బోర్డు నుంచి కాలు జారి జరగకూడనిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకం. కాకినాడ ఉప్పాడ బీచ్‌రోడ్డులో కానీ, కాకినాడ వయా పిఠాపురం కొత్తపల్లి మీదుగా ఉప్పాడకు ఆర్టీసీ సర్వీసు ఏర్పాటు చేస్తే ప్రయాణికులు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు ఆర్టీసీఅధికారులను కోరుతున్నారు.


ఉప్పాడలో బస్ ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థులు

'రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సంకురాత్రి ఫౌండేషన్, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం పెనుమర్తితో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఫౌండర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వివిధ కళాశాలల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ వైడీ రామారావు, రోటరీ బ్లడ్ బ్యాంకు డాక్టర్ కామరాజు, సంకురాత్రి ఫౌండేషన్ డైరెక్టర్ జీవీ రావు, కిరణ్ కంటి ఆసుపత్రి ఎండీ డాక్టర్ అవినాష్ మహీందర్, ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ మేనేజర్ పెద్దిరెడ్లసత్యనారాయణ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కాకినాడ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు అపార్ ఐడీ నమోదు ప్రక్రియలో వారి తల్లిదండ్రుల పేర్లు ఆధార్‌కార్డులో సవరణల కోసం మండలంలోని ప్రతీ కాంప్లెక్స్ పరిధిలోనూ ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరుతూ కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఎస్టీయూ కాకినాడ జిల్లాశాఖ పక్షాన మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. అపార్ ఐడీ నమోదులో చాలామంది విద్యార్థులు పుట్టిన తేదీ, అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లోని వివరాలు సరిపోవడం లేని కారణంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా అపార్ ఐడీ నమోదు పెంచాలని కోరారు. ఇటీవల సస్పెండైన పిఠాపురం ఎంఈవో ఆర్వీ ప్రసాద్‌ను ప్రస్తుతం ఎఫ్ఏసీగా పనిచేస్తున్న బి.శ్యాంబాబుకు సేవా పుస్తకాలు అప్పగించకపోవడం వల్ల ఉపాధ్యాయుల వార్షిక ఇంక్రిమెంట్లు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పింఛను ప్రతిపాదనలు జరగడంలేదని ఈ సమస్యల పరిష్కారానికై చర్యలు చేపట్టాలని కోరినట్లు ఎస్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీ విశ్వనాథ్ తెలిపారు. వినతి అందజేసినవారిలో రాజు, రామకృష్ణ, మహేష్, వెంకట్, శ్రీకాంత్ ఉన్నారు.

'ఈపీఎఫ్‌వో బకాయిలు చెల్లించి సహకరించాలి'

కాకినాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని సంస్థల నుంచి ఈపీఎఫ్ బకాయి నిధుల వసూళ్ల లక్ష్యంగా ఈపీఎఫ్‌వో ప్రత్యేక చర్యలు చేపట్టిందని భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ అనుబంధ ఉద్యోగి భవిష్యనిధి సంస్థ కాకినాడ జిల్లా రికవరీ ఆఫీసర్ ఎం.రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు తెలియజేస్తూ నవంబరు 2024 నుంచి జనవరి 2025 వరకు ప్రత్యేక వసూళ్ల డ్రైవ్ జరుగుతుందన్నారు. ఈ డ్రైవ్‌లో అన్ని సంస్థలు బకాయి నిధులను త్వరగా జమ చేయాలని లేకపోతే ఈపీఎఫ్ బకాయిలు చెల్లించాల్సిన సంస్థలను గుర్తించి చట్టపర మైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛందంగా నిధులను చెల్లించేలా ఇతర శాఖల సమన్వయంతో బకాయిదారులతో ప్రత్యక్షంగా సంప్రదిస్తామన్నారు. సంస్థలు ఈపీఎఫ్ అండ్ ఎంపీ చట్టం 1952 నిబంధనలను పాటించాలని, బకాయిలు చెల్లించి ఈపీఎఫ్‌వోతో సహకరించాలని ప్రకటనలో కోరారు.

'పనివేళల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి'

పిఠాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచే ఉన్నత పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మణికుమార్, ఎస్.సాయికృష్ణ మంగళవారం డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం విద్యార్థులపై ఒత్తిడి పెంచి వారి అభ్యసనా సామర్థ్యాలను దెబ్బతీస్తుందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పిల్లలుకు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండగా ఇళ్లకు ఆలస్యం చేరతారని, ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఒక వైపు యాప్‌ల భారం పెంచుతూ పనివేళల పెంపు నిర్ణయం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. సుదీర్ఘ కాలంగా వస్తున్న సంప్రదాయానికి అనుగుణంగానే రోజుకి 7గంటల పనివేళలను కొనసాగించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బీజేపీని బలోపేతం చేయాలి

గొల్లప్రోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలింగ్‌బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రాజు, క్రియాశీలక సభ్యత్వ ఇన్‌చార్జి మలిరెడ్డి నారాయణరావు సూచించారు. గొల్లప్రోలులోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం పట్టణాధ్యక్షుడు చిట్టా మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బూత్ కమిటీ ఎన్నికలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుర్రా రామాంజనేయ, వాసంశెట్టి శ్రీనివాస్, కర్రి సత్యనారాయణ, పోసిన సత్యనారాయణ, అడబాల మోహనరావు తదితరులు ఉన్నారు.

టాపర్‌కు ప్రతిభా అవార్డు

కాకినాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీలో టాపర్‌గా నిలిచిన మాదాడ సకీనాకు మల్లిక మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ప్రతాపనేని నవీన్, ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు రూ.3000 నగదు బహుమతి, పతకాన్ని, ప్రతిభాపత్రాన్ని అందజేశారు. ఈ విద్యార్థిని ఇంటర్‌లో 838 మార్కులు సాధించిందన్నారు. నవీన్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా డిసెంబరులో కళాశాలలోని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తామని, నర్సింగ్ విద్యార్థినులకు శిక్షణ నిచ్చి జపాన్ వెళ్లే అవకాశం కూడా కల్పిస్తామన్నారు.

రీసర్వేపై 173 వినతులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో రీసర్వేపై 173 వినతులు అందాయి. భూముల రీసర్వేకు సంబంధించి విస్తీర్ణంలో తేడాలపై 100, జాయింట్ ఎల్‌పీఎంలపై 38, సర్వే నెంబర్లపై 5, క్లాసిఫికేషన్స్‌పై 6, మ్యుటేషన్స్ కోసం 28 దరఖాస్తులు వచ్చాయి. తహశీల్దారు సత్యనారాయణ, రీసర్వే డీటీ మస్తానీ, సర్వేయర్ కేదారేశ్వరరావు తదితరులున్నారు.

ఆర్గానిక్ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్


విరవలో మాట్లాడుతున్న విజయకుమార్

పిఠాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. పిఠాపురం మండలం విరవలో మంగళవారం పొలంబడి క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్గానిక్ పద్ధతిలో వరి సాగు చేసిన రైతులు తమ అనుభవాలను వివరించారు. ఈ పద్ధతిలో దిగుబడులు స్వల్పంగా తగ్గినా మంచి ధర లభిస్తుందని విజయకుమార్ చెప్పారు. రైతులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పొలంబడి కార్యక్రమాన్ని సక్రమంగా ఆచరించిన రైతులు గోపు వీరభద్రరావు, మల్యాల అచ్యుతరామయ్య, తమ్మనబోయిన నాగేశ్వరరావును సత్కరించారు. ఏఈవోగా పదోన్నతి పొందిన వీఏఏ రమ్యను అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో అచ్యుతరామయ్య, ఉద్యానవనశాఖాధికారి శైలజ, ఏఈవో రామకృష్ణ ఉన్నారు.

ఉలిమేశ్వరంలో 'పొలం పిలుస్తోంది'

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉలిమేశ్వరం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నల్లి దైవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొను గోలు చేయడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రబీ పంట కాలానికి రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తామన్నారు. ఉద్యానశాఖాధికారిణి నూనే సుజాత, ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్, పశువైద్యురాలు గంగాభవానీ, ఏఈవో రాగ స్రవంతి, ప్రసాద్ పాల్గొన్నారు.

పిండినల్లి నివారణకు సస్యరక్షణ చర్యలు

సైంటిస్ట్ సుధారాణి


దుర్గాడలో మాట్లాడుతున్న సుధారాణి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పత్తి పంటపై ఆశించిన పిండినల్లి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎం.సుధారాణి సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో పత్తి పంటపై పిండినల్లి, ఇతర తెగుళ్ల ఆశించడం, దిగుబడి రాక, ధర లేక రైతులు పత్తి పంటను తొలగిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలతో ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికే శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపారు. ఇప్పుడు మళ్లీ రైతులకు దుర్గాడ రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పిండినల్లి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఎసిఫేట్ 2గ్రాములు లేదా ట్రొఫికోనజోల్ 3మి.లీలు ఒక లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200లీటర్ల మందు ద్రావణాన్ని సర్ఫ్ లేదా టీపాలు కాని స్ప్రేయర్‌కు 50 గ్రాములు వంతున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి మాట్లాడుతూ పత్తి రైతుల సౌకర్యార్థం పిఠాపురంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కడ పత్తిని రూ.71 నుంచి రూ.75వరకూ కొనుగోలు చేస్తారని చెప్పారు. మినుములు, నువ్వుల సాగుపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ ఎనలేని కృషి'


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కాకినాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ ఎనలేని కృషి చేశారని, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి కార్యక్రమాన్ని పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పళ్లంరాజు మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధానిగా, ఉక్కు మహిళగా విశేష సేవలందించారన్నారు. ఇందిరమ్మ ఆశయాల సాధనకు ప్రతీ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, కాకినాడ సిటీ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, ఐఎన్‌టీ యూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, జిల్లా నాయకులు తుమ్మల దొరబాబు, ముమ్మిడి సత్యనారాయణ, దవులూరి ధనకోటి, తాండ్రంకి రమణ మూర్తి, వనుం రమణ, పిల్లి చిన్న సత్యవతి, లలిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తాం


పిఠాపురం ఎంపీడీవోకు ధర్నా నోటీసు అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

పిఠాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని యూటీఎఫ్ అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు యూటీఎఫ్ ప్రతినిధులు మంగళవారం పిఠాపురం ఎంపీడీవో చిన్నారావును కలిసి ధర్నా నోటీసు అందజేశారు. 2నెలల క్రితం అప్పటి ఎంఈవో ఆర్వీ ప్రసాద్ సస్పెండ్ అయిన నాటి నుంచి ఉపాధ్యాయులకు జీతాలు మినహా ఇంక్రిమెంట్లు, ఎరియర్లు, మెడికల్ బిల్లులు చేయడం లేదని వారు తెలిపారు. దీనిపై ఎంఈవో శ్యాంబాబును కలవగా సర్వీసు రిజిస్టర్లు తన పరిధిలో లేవని, అందువల్లే బిల్లులు చేయడం లేదని చెప్పారన్నారు. సత్వరం అన్నిరకాల చార్జి తీసుకుని ఉపాధ్యాయులకు సంబంధించి అన్నిరకాల బిల్లులను చేయించాలని, లేదంటే 25వ తేదీన ప్రత్యక్ష చర్యకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.సూరిబాబు, కోశాధికారి ఏ.సీతారామరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాస్, డి.ప్రవీణ్‌కుమార్, కేవీ రమణ, వి.పాములయ్య, ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

కరప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉప్పలంక కాలభైరవస్వామి ఆలయానికి దాత ఇచ్చిన భూమి ఆక్రమణపై గ్రామసర్పంచ్ బొమ్మిడి నయోమిసతీష్ మంగళవారం అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ కాలెపు ఆనందరావు అనే వ్యక్తి గ్రామంలోని సర్వేనెంబరు 106/1ఎలోని 2 ఎకరాల భూమిని 2006లో కాలభైరవస్వామికి రాసిచ్చారన్నారు. అయితే ఇందులో మూడొంతుల భూమి ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులు చెట్లను పెంచి, గృహనిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉప్పలంకలో ఉపాధిహామీ పథకం కింద 2005-2009 చేసిన పనుల్లో పలు అవకతవకలు జరిగాయని, చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎంపీడీవో మట్టపర్తి అనుపమకు ఫిర్యాదు చేశారు.

'గృహనిర్మాణాలను పూర్తిచేయాలి'

కరప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో వెంటనే గృహనిర్మాణాలను చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. కరప సెంట్రల్ లేఅవుట్‌ను మంగళవారం హౌసింగ్ ఏఈ పెండెం నాగేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్‌లతో కలిసి వారు సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. డిసెంబరు నెలాఖరు నాటికి లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని, మార్చి నెలాఖరుకు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయాలన్నారు. పెనుగుదురు, కొరుపల్లి, జడ్.బావారం గ్రామాల్లోని లేఅవుట్‌లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు.

బాలలపై లైంగిక వేధింపులను వ్యతిరేకించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పి.ఆదిలక్ష్మి


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరూ బాలలపై లైంగిక వేధింపులను వ్యతిరేకించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పి.ఆదిలక్ష్మి అన్నారు. బాలలపై లైంగిక వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ పీడీ కొండా ప్రవీణ ఆధ్వర్యంలో పోలీస్ డిపార్టుమెంట్, సోము దుర్గాప్రసాద్ చారిటబుల్ ట్రస్టు, సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ మరిన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో 600 మంది విద్యార్థులతో మంగళవారం కాకినాడ మసీదు సెంటర్ నుంచి గవర్నమెంట్ ఆసుపత్రి వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పి.ఆదిలక్ష్మి హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతూ ఎక్కడైనా బాలలను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే 1098, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. పీడీ ప్రవీణ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సమాజంలో బాలల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, చిన్నారి రక్షణ, కిషోరి వికాసో వంటి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వారి పరిరక్షణకు ఎంతో కృషి చేస్తుందన్నారు. జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ వెంకటరావు, చైల్డ్‌లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు భరోసా

సర్పవరం జంక్షన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పి.ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ అన్నారు. రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో ట్రైనింగ్ కలెక్టర్ భావన, ప్రవీణ ఆధ్వర్యంలో బాలల హక్కులపై నూరుశాతం చైల్డ్ సేఫ్టీ ఓరియంటేషన్ జిల్లాస్థాయి సమావేశం ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందికి అవగాహన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీవోలున్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక వాట్సాప్ నంబరు

జేసీ రాహుల్‌మీనా


వేట్లపాలెంలో ధాన్యం పరిశీలిస్తున్న జేసీ

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక వాట్సాప్ నంబరు 7337359375కు వాట్సాప్ చేసిన కొద్ది గంటల్లోనే ధాన్యాన్ని రైతుల నుంచి సమీపమిల్లులకు తరలించే ప్రక్రియ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచే ప్రారంభించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వెల్లడించారు. రైతుకష్టం దళారుల పాలు పేరిట ఆంధ్రజ్యోతిలో నెల 15న కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించి జేసీ సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి సామర్లకోట మండలం వేట్లపాలెంలో రైతులు ఆరబోసిన ధాన్యం రాశులను పరిశీలించి సమీక్షించారు. ఆరబోసిన ధాన్యాన్ని సమీప రైతు సేవాకేంద్రం సిబ్బంది ధాన్యం నమూనాలను తీసుకెళ్లి పరీక్షిస్తారన్నారు. వ్యవసాయసిబ్బంది కూపన్లు జనరేట్ చేసి సమీప రైస్‌మిల్లుకు పంపుతారని, ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతు బయోమెట్రిక్ ద్వారా ఎఫ్‌టీవో ఇవ్వడం జరుగుతేందన్నారు. జీపీఎస్ ఫిక్స్ చేసిన వాహనాల ద్వారానే ధాన్యం రవాణా జరగాలని సూచించారు. జేసీ పలువురికి రైతుల ధాన్యాన్ని మిల్లులకు తరలించి ట్రక్‌షీట్, ఎఫ్‌టీవోలను అందజేశారు. అనంతరం ఆదిలక్ష్మి రైస్‌మిల్లును సందర్శించారు. జేసీ వెంట సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు ఎండీ నాయక్, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మండల వ్యవసాయాధికారిణి ఇమ్మిడిశెట్టి సత్య , డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, వీఆర్వోలు మామిడాల కామరాజు, కెవీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

వరల్డ్ టాయిలెట్ డే


కరపలో పారిశుధ్య కార్మికులకు సన్మానం

కరప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకుని వాటిని వినియోగించాలని మండల ప్రత్యేకాధికారి జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. కరప పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతీఒక్కరూ తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయడం వల్ల అనేక రోగాల వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి పండ్లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలదేవి, బీసీ త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో రవికుమార్, ఎంఈవోలు బి వేణుగోపాల్, జిఫైడిరాజు, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులను సత్కరించడం కోసం మండలస్థాయిలో సమీక్ష చేశారు.

కార్పొరేషన్: కాకినాడ జగన్నాధపురం అన్నమ్మఘాటీ వద్ద గల గంటి మోహన చంద్ర బాలయోగి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుచ్చిబాబు, కె.విశాలాక్షి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రంచేసిన పారిశుధ్య కార్మికులను ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలుచోట్ల శుభ్రతపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి విజెవి రమణ, మండల ప్రజాపరిషత్ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు


కొత్తపల్లి: ఉప్పాడలో పోటీల్లో విద్యార్థులు

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఎంపీడీవో డి.శ్రీలలిత, ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మిరియాల జయశ్రీ, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

కరప: మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని వేళంగి లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయవారోత్సవాల విశిష్టత, మహిళల అభ్యున్నతి, దిశా చట్టం, మహిళా సాధికారికత, తదితర అంశాలపై చర్చించారు.

సామర్లకోట: సామర్లకోట ఉపగ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి బందిల రత్నమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా మనుమంతరావు, బాలమురళి, మణికంఠ, శ్రీనివాస్ వ్యవహరించారు. ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రాజరాజేశ్వరి, ఎంప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఉప్పాడ శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి టీ నళినీ ప్రియ విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పిఠాపురం: పిఠాపురంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం నిర్వహించి వివిధ రంగాల్లో ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వై.జ్యోతి, బీఎంఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పీడీ సత్యప్రియ, గ్రంథాలయాధికారి వెంకటరాము పాల్గొన్నారు.

దుర్గాడలో ముగిసిన సప్తాహ మహోత్సవాలు


దుర్గాడ శివాలయంలో రజత ఆభరణాల అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న సప్తాహ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. 168గంటల పాటు నిరంతరాయంగా జరిగిన ఈ భజన కార్యక్రమాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 65కిపైగా భక్త భజన సమాజాలు పాల్గొన్నారు. అనంతరం 1100కిలోల వండిన అన్నంతో స్వామికి మహానివేదన చేశారు. సంకట హర చతుర్థి, ప్రాంతీయ నాగులచవితి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్లను రజత ఆభరణాలతో అలంకరించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నవజాత శిశు సంరక్షణపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య బృందం

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ నవజాత వారోత్సవాల సందర్భంగా జీజీహెచ్ పిడియాట్రిక్ లెక్చర్ గ్యాలరీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్ లావణ్యకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ నవజాత శిశువు వారోత్సవాలు ఈనెల 21 వరకు జరగనున్నాయి. డీఎంహెచ్‌వో డా.జెనరసింహనాయక్, పిడియాట్రిక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌వోడి డా.మాధవి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తల్లులకు పిల్లల విషయంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నవజాత శిశువులను సంరక్షించే విధానాలు, ఆవశ్యకతలు వివరించారు. కార్యక్రమంలో డీఐవో డా.సుబ్బరాజు, పిడియాట్రిక్ వైద్య నిపుణులు డా.బుర్రి రాంబాబు, డా.ఎం.వెంకటేశ్వర్లు, డా.విద్య, డా.మధన్‌మోహన్, డా.గోపిచంద్, పీజీ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు


పిఠాపురంలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు, సీఐ శ్రీనివాస్

పిఠాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంతో పాటు సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రంకన్ డ్రైవ్ టెస్టులు జరిపి పిఠాపురం టౌన్, రూరల్, గొల్లప్రోలు పోలీసుస్టేషన్ల పరిధిలో 8 కేసులు నమోదు చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్న వారిని ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు. రికార్డులు సక్రమం లేని, నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. తనిఖీల్లో కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐలు మణికుమార్, రామకృష్ణ, గుణశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా

తాళ్లరేవు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి మద్యం తాగి వాహనాలను నడిపిన వ్యక్తులకు జరిమానా విధించినట్టు కోరింగ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కోరింగ స్టేషన్ పరిధిలో పోలేకుర్రు వైజంక్షన్ వద్ద 13మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి రూ.10,000 చొప్పున జరిమానా, ముగ్గురికి 2రోజుల జైలుశిక్ష విధించినట్టు తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని తాళ్లరేవు ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నట్టు సీఐ కె.కోటేశ్వర్ మంగళవారం తెలిపారు. తాళ్లరేవు మండలం పోలేకుర్రుకు చెందిన కాల శ్రీనివాస్ బెల్ట్‌షాపు నిర్వహణకు యానాం నుంచి 30 మద్యం బాటిల్స్‌ను జార్జీపేట నుంచి పత్తిగొంది రహదారి వెంబడి ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు. బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తున్నట్టు సీఐ తెలిపారు.

కరాటే పోటీల్లో పతకాలు

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్టణంలో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన కాటా సహస్ర (గోల్డు మెడల్), కాటా యోగేష్ (కాంస్య) పతకాలు సాధించారు. క్రీడాకారులను, కోచ్ దుంగల పూజిత సూర్యశ్రీని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ, కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

వజ్రకూటంలో జేసీ పరిశీలన

శంఖవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రకూటంలో ఆల్‌సమీ ఆగ్రో ప్రొడక్ట్స్ (పశు కబేళా)ను జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా మంగళవారం సాయంత్రం ఆర్డీవో శ్రీరమణి, తహశీల్దార్ పోతురాజుతో కలిసి పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. జిల్లాలోని ఫ్యాక్టరీల పనితీరు పరిశీలనలో భాగంగానే సాధారణ తనిఖీకి వచ్చినట్టు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీలు ఉద్యమిం చాల్సిందేనని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చిన్నవీరభద్రం పేర్కొన్నారు. చింతూరులో మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లా డారు. ఆదివాసీల కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం దాదాపు 300 ఆదివాసీ గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు. పోలవరంతో నష్టపోయిన గిరిజన కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన రాజకీయ పార్టీలు ఇప్పుడు మిన్నకుండి పోయాయన్నారు. అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు ఒక న్యాయం, పోలవరం కోసం భూములు త్యాగం చేసిన గిరిజనులకు ఒక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. ఆదివాసీల రక్షణ కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలను అములు చేయాలని నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంజా శ్రీను, పొడియం లక్ష్మణ్, సురేష్, రవి, నాగేశ్వరరావు, సోడి ప్రసాద్, సవలం కోటి, సవలం రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం చప్టాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ధర్నా



వరామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజోతి): రేఖపల్లి పంచాయతీ అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల మధ్యలో గల చప్టాపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిం చారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ అన్నవరం చప్టాపై తాత్కా లికంగా నిర్మించిన చప్టాపై వెంటనే మరమ్మతులు చేసి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక చప్టా నిర్మాణం వల్ల గతంలో కురిసిన భారీ వర్షాలకు చప్టాపై నుంచి వరద నీరు ప్రవహించడంతో చప్టాకు ఇరువైపులా పోసిన మట్టి కోట్టుకుపోయి పెద్ద వాహనాల రాకపోకలు నిలిచి పోయ్యాయన్నారు. బస్సులు తిరిగే అవకాశం లేక రాజమహేంద్రవరం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్, తహశీల్దార్ అక్కడకు చేరుకుని సీపీఎం నాయకులు, ప్రజలతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పులి సంతోష్‌కుమార్ సోయం చినబాబు, పూనెం ప్రదీప్‌కుమార్, వెట్టి లక్ష్మి, పొడియం శ్రీరామూర్తి, గుండుపూడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ తెగల అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ అస్మ ఫర్హీన్

రంపచోడవరం, నవంబరు 19: సీఐడీ అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాలతో స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం సీఐడీ అదనపు ఎస్పీ అస్మ ఫర్హీన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ తెగల అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అస్మ ఫర్హీన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే వారికి చట్ట ప్రకారం లభించే రక్షణ తదితర వివరాలు ప్రజలకు తెలిసేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరు కల్పశ్రీ, డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపాల్‌రావు, ఎస్డీపీవో జి.సాయి ప్రశాంత్, విశ్రాంత ఎస్ఐ కె.సాల్మన్‌రాజు, తహసీల్దారు రామకృష్ణ, ఆదివాసీ నాయకులు తెల్లం శేఖర్, కె.రామన్నదొర, సీఐలు రవికుమార్, గోపాలకృష్ణ, సన్యాసినాయుడు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

విధులకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు: ఐటీడీఏ పీవో

రంపచోడవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరయ్యే సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం పెదగెద్దాడ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేలా కృషిచేయాలన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి

రంపచోడవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల26న రంపచోడవరంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఐటీయూ, కార్మిక, రైతు సంఘాల పిలుపునిచ్చాయని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, శానిటేషన్, ఉపాధి హామీ, ప్రకృతి వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు, వీవోఏలు, వీఆర్ఏలు, వలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు



గన్నవరం ఎస్సీ కాలనీలో సభ్యత్వాల నమోదు దృశ్యం

ఎటపాక, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ సభ్యత్వాల నమోదు కొనసాగు తోంది. గన్నవరం, ఎటపాక, నెల్లిపాక, పురుషోత్త పట్నం తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు సభ్యత్వాలను నమోదు చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు రెండు వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశారు. గన్నవరంలో రెండో రోజు మంగళ వారం టీడీపీ నాయకులు బొల్లా పుల్లయ్య ఆధ్వర్యంలో 200 సభ్యత్వాలు నమోదు చేశారు.

తోటపల్లిలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయాలి

ఎటపాక, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రధాన సెంటర్‌లో ఆధార్ నమోదు క్యాంపు ఏర్పాటు చేయాలని టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు, టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ కోరారు. తోటపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తోటపల్లి పరిధి గ్రామాల్లో ఆధార్ సెంటర్ అందుబాటులో లేక విద్యార్థులు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు తెలంగాణలోని భద్రాచలం వెళ్తున్నారని తెలిపారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు కోసం 25 కిలోమీటర్ల దూరంలోని ఎటపాకలోని ఆధార్ కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తోటపల్లితో పాటు ప్రతీ గ్రామంలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు.

గిరిజన సహకార కార్పొరేషన్ డైరెక్టర్‌గా గొర్లె సునీత




రంపచోడవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ (కార్పొరేషన్) రాష్ట్ర డైరెక్టర్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గొర్లె సునీతను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2009 ఎన్నికల నుంచి రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ టికెట్ కోసం ఆమె ప్రయత్నిస్తూ వచ్చారు. ఆమె ఇప్పటికే పార్టీలో మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలిగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టీడీపీ టికెట్ కోసం ఆమె తీవ్ర ప్రయత్నాలు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం గిరిజన సహకార సంస్థకు డైరెక్టర్‌గా ఆమెను నియమించారు. ఈమె నియామకంపై పార్టీలో పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా రుద్రాభిషేకం పూజలు



వై.రామవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యార్లగడ్డ సమీపంలో అటవీ ప్రాంతంలో ఉన్న ప్రకృతి సిద్ధ గురమంద విశ్వనాథ స్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రాన రుద్రాభిషేకం, రుద్రహోమం, శివపార్వతుల కల్యాణం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. వేదపండితులు పల్లావఝల రామకృష్ణశర్మ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. పూజల్లో సర్పంచ్ పద్మావతి, తహశీల్దార్ వేణుగోపాల్, డాక్టర్ చైతన్య, అడ్డతీగల మాజీ ఎంపీపీ అన్నం సత్యనారాయణ, గుడి కమిటీ చైర్మన్ పల్లాల వెంకటరమణరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో మన్యం



మోతుగూడెం నుంచి పొల్లూరు వెళ్లే రహదారి మధ్యలో మంచు

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం మన్యంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో చలితీవ్రత పెరిగింది. మంచు దట్టంగా కురుస్తోంది. మంగళవారం ఉదయం 9గంటల వరకు మంచు వీడ లేదు. మన్యం మంచు దుప్పట్లోకి జారుకుంటుంది. దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో రోజు వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోవడతో ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. ఏజెన్సీలో ప్రకృతి అందాలు వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులు చలితో అవస్థలు పడుతున్నారు.

ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు4న జరగబోయే విజయవాడ జింకానా మైదానంలో నిర్వహించే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చింతలూరులో ఈ ర్యాలీని లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు ప్రారంభించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 5 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు దృష్టి అంతా కార్పొరేట్ కంపెనీలు, విద్యవైద్య రంగ మాఫియాలను సంతృప్తిపరచడంలోనే ఉందని.. వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు మధ్యతరగతి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ర్యాలీ గజ్జనపూడి, శరభవరం,ఒమ్మంగి, ఉత్తరకంచి, లంపకలోవ, పెద శంకర్లపూడి, చినశంకర్లపూడి, ధర్మవరంల మీదుగా కొనసాగింది. పొలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్, లిబరేషన్ నాయకులు ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చబాబు, కాడి నాగేశ్వరరావు, తూము చల్లబాబు, రాజాల ఏసురత్నం, రాజామణి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు చేపట్టిన ర్యాలీ మండలం లోని భద్రవరం, లింగంపర్తి, ఏలేశ్వరం మీదుగా సాగింది.నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

108 కిలోల విబూదితో శివలింగానికి అభిషేకం



గండేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉప్పలపాడులో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం 108 కిలోల విబూదితో ఆలయ పురోహితులు చంద్రమౌళి సుబ్బారావుశర్మ ఆధ్వర్యంలో అభిషేకం చేశారు.

లక్షపత్రి పూజ

రౌతులపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి శివాలయంలో శ్రీశ్రీనివాసావర్తక సంఘం అధ్యక్షుడు యడ్ల బుజ్జీ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ జరిగింది. అన్నదా నం నిర్వహించారు. రౌతులపూడిలో చిన్నవర్తక సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధ చేపట్టారు.

బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి




తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూనవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తల్లులు ఆరోగ్యంతో పాటు బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కూనవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ కె.మహేష్ బాబు తెలిపారు. మంగళవారం నవజాత శిశువు సంరక్షణ వారోత్సవాల సందర్భంగా కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లోని తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు బిడ్డల ఆరోగ్యంపై దృష్టిపెట్టి మంచి పౌష్టికాహారంతో పాటు వైద్య సేవలు పొందాలన్నారు. తల్లులు వైద్య సిబ్బంది సలహాలు తీసుకోవాలన్నారు. కూనవరం గైనకాలజిస్టు డాక్టర్ పి.శ్వేత మాట్లాడుతూ బిడ్డలకు తప్పకుండా తల్లిపాలే ఇవ్వాలన్నారు. ఎస్ఎన్‌సీయూ పిల్లల వైద్యురాలు డాక్టర్ ప్రజ్వల మాట్లాడుతూ పిల్లల పట్ల ప్రతీ తల్లి శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం తల్లులకు ఆహారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజ, డాక్టర్ వివేక్‌నాయక్, యూనిట్ సిబ్బంది కె.ఇందు, దుర్గమ్మ, ఎ.శ్రీవల్లి, బి.మౌనిక, కె.సత్యపావని, ఫార్మసీ ఆఫీసర్ సృష్టి జోగారావు, ఎన్ఆర్‌సి కౌన్సిలర్ కె.రమేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లలో తు(తి)ప్పలు

జంగిల్ క్లియర్ చేయాలని ప్రయాణికులు, వాహనదారుల విన్నపాలు



మోతుగూడెం సమీపంలో రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం నుంచి లక్కవరం ప్రధాన రహదారుల్లో తుప్పలు వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మోతుగూడెం నుంచి లక్కవరం జంక్షన్ వరకు మోతుగూడెం-డొంకరాయి తదితర రోడ్లలో ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో వాహనాలు దగ్గరగా వస్తేగాని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. మోతుగూడెం నుంచి డొంకరాయి మార్గమధ్యలో ఫోర్ బై మలుపులో వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రమాదకరమైన మలుపులకు తోడు రహదారులు పలు చోట్ల అంచులు దెబ్బతిన్నాయి. గోతులు ఏర్పడటంతో అటుగా రాకపోకాలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి

ఆర్డీవో శ్రీరమణి



శంఖవరం: కత్తిపూడిలో మానవహారం దృశ్యం

శంఖవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటా మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ఆర్డీవో శ్రీరమణి అన్నారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కత్తిపూడి సెంటర్‌లో మానవహారం నిర్వహించి అవగాహన నిర్వహించారు. ఎంపీడీవో ఎస్ఎస్.శర్మ, పంచాయితీ విస్తరణాధికారి వి.చక్రవర్తి ఆధ్వర్యంలో కత్తిపూడి పాఠశాలలో పంచాయితీ పారిశుధ్య కార్మికులకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు భవానిశంకరుడు, జయలక్ష్మి, వీరబాబు, ఏఈ మారుతి తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో వైఎస్సార్ కాలనీలో డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

ఎంపీడీవో కుమార్, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, పంచాయతీ కార్యదర్శి వి.కామరాజు, నాయకులు దాట్ల అప్పన్నబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య సభ్యులు ఉన్నారు.

గండేపల్లి: ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, డ్రైనేజీ నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత పలు అంశాలపై ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హౌసింగ్ ఏఈ బి.రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అప్పలరాజు, ఏవో చంద్రశేఖర్, పలుశాఖాధికారులు ఉన్నారు.

కోటనందూరు: కోటనందూరు సచివాలయంలో పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. ఎంపీడీవో పి.వెంకటనారాయణ, ఈవోపీఆర్డీ జయరామ్, పంచాయతీ కార్యదర్శి మోహన్ ఉన్నారు.

ఏలేశ్వరం: లింగంపర్తిలో మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సూర్యనారాయణ, వ్యవసాయ అధికారి ఎస్.మల్లికార్జునరావు క్లాప్ మిత్రల సిబ్బందిని సత్కరించారు.పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళల రక్షణే ధ్యేయం'

జగ్గంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా మహిళా రక్షక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. మంగళవారం మల్లిశాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళారక్షక్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళా రక్షక్ కార్యక్రమంలో భాగంగా డయల్ 112,100, 9494933233 వాట్సాప్ నెంబర్లు, పోలీస్ సేవల పట్ల విస్తృత ప్రచారం నిర్వహించారు. బాలబాలికలు, విద్యార్థులకు స్వీయ భద్రత, మహిళా బాలబాలికల సంరక్షణా చట్టాలపై అవగాహన కల్పించారు. మల్లిసాల సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం లక్ష్మణ్, రాంబాబు, పైడిపాల సత్యనారాయణ, పైడిపాల సూరిబాబు, తొట్టిపూడి నాగేశ్వరరావు, ముక్క రాజబాబు, విద్యాకమిటీ చైర్మన్ జొన్నాడ వీరబాబు తదితరులున్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

కోటనందూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పేట, బిళ్లనందూరులో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటలను పరిశీలించారు. వరి పంటలు కోసేవారికి అపరాలు రైతు సేవాకేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయన్నాని, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు వరి, పత్తి చేలో వచ్చే తెగుళ్లపై అధికారులు చెప్పారు.

ఎమ్మెల్యే దివ్య చిత్రపటానికి పాలాభిషేకం

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మత్స్యకారుల సమస్యలపై ప్రస్తావించిన తుని ఎమ్మెల్యే యనమల దివ్య చిత్రపటానికి మంగళవారం కొత్త పెరుమాళ్లపురంలో పాలాభిషేకం నిర్వహించారు. బేస్ పిరియడ్ అమౌంట్, బోట్లు, వలలు, ఇంజన్లు, హౌసింగ్ సబ్సిడీ, సెజ్ వల్ల నష్టపోతున్న మత్స్యకారులపై మాట్లాడడం సంతోషాన్ని కలిగించిందని మత్స్యకార నాయకుడు చొక్కా మహంకాళి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, గరికిన రాజబాబు, పీక్కి శ్రీరామ్, ఆరుగ్రామాల మత్స్యకార నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజపూడిలో లక్ష బిల్వార్చన

జగ్గంపేట రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రాజపూడి శివాలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని లక్షల బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ప్రధాన పూజారి పాలంకి బద్రీనాథ్ పాల్గొన్నారు.

శివలింగాలతో ఊరేగింపు

ఏలేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరంలో శ్రీరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు, అయ్యప్పస్వాములు 108 శివలింగాలకు కలశపూజ నిర్వహించి గ్రామంలో నగర సంకీర్తన చేస్తూ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో కూరెళ్ల రాజా శర్మ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతికి 22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



ది. లింగంపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నెం-791
యం.యస్.జి. అవినాష్
అసిస్టెంట్ రిజిస్ట్రార్, పర్సన్ ఇంఛార్జ్
సంఘ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి మరియు సిబ్బంది

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
APO నాగరాజు, కుంచె సంగీత లక్ష్మి JE
ఏలేశ్వరం మండలం



శ్రీ ఆర్.వి.వెంకటేశ్వరరావు
తహశీల్దార్ - ఏలేశ్వరం
ఏలేశ్వరం మండలం రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది



శ్రీ లక్ష్మీబాలాజీ జ్యూయలర్స్
మార్కెట్ రోడ్, ఏలేశ్వరం
వాగు రాజేష్
ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికమిటీ చైర్మన్, ఏలేశ్వరం



మార్స్ కంప్యూటర్స్ వారి డిస్టెన్స్ ఎడ్యుకేషన్
అడపా దుర్గారావు, సెల్: 9177582624, ఏలేశ్వరం
మా గైడెన్స్ పై100% గ్యారెంటి పాస్ మా ప్రత్యేకత
ఆంధ్రా యూనివర్శిటీ, నాగార్జున యూనివర్శిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీల స్టడీ సెంటర్
ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లమా పాసైన వారికి డిగ్రీ కోర్సులు
B.A., B.Com., B.sc., B.B.A.,
డిగ్రీ పాసైన వారికి పి.జి కోర్సులు
M.A., M.Com., M.Sc., M.B.A., B.L.I.S.C., M.L.I.S.C.,
పూర్తి చేసుకునే అవకాశం
కేవలం ఒకేఒక్క సంవత్సరంలో
డైరెక్ట్ 10 th
ఇంటర్ (M.P.C.,Bi.P.C.,C.E.C., H.E.C.) పూర్తి చేసుకునే అవకాశం!
అడ్మిషన్లు కొరకు సంప్రదించవలసిన మా అడ్రస్
మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటి
అడపా దుర్గారావు,
సెల్: 9177582624, ఏలేశ్వరం